

**జెడ్పీ చైర్మన్‌ను కలిసిన వీఆర్‌ఏలు**

మంథని: ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించడం పై హర్షం వ్యక్తంచేస్తూ బుధవారం డివిజన్ లోని వీఆర్‌ఏలు జెడ్పీ చైర్మన్‌ను ఆయన నివాసంలో కలుసుకున్నారు. స్వీట్లు తినిపించారు.



**జిల్లాకు నాలుగు అంబులెన్స్‌లు**

మంథని: ఆరోగ్య తెలంగాణే లక్ష్యంగా పనిచేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం జిల్లాకు కొత్త నాలుగు అంబులెన్స్‌లు కేటాయించింది.

8లో

గరిష్ఠం/కనిష్ఠం
31.0/26.0

**వాతావరణం**

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. కొన్ని చోట్ల చిరుజల్లులు కురిసే అవకాశముంది. చలిగాలులు కొనసాగుతాయి.

## న్యూస్‌రీల్

### పేదలకు వైద్యం అందించడమే ప్రభుత్వం లక్ష్యం



అంబులెన్స్‌ను ప్రారంభిస్తున్న మంత్రి కొప్పుల

ధర్మారం: నిరుపేదలకు మెరుగైన వైద్యం అందించడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. మండలకేంద్రానికి కొత్తగా మంజూరైన 108 వాహనాన్ని బుధవారం మంత్రి కొప్పుల ఈశ్వర్ ప్రారంభించారు. ప్రభుత్వం 108, 104, అమ్మఒడి వాహనాల ద్వారా మారుమూల ప్రజలను మెరుగైన వైద్యం కోసం పెద్ద ఆసుపత్రులకు తరలిస్తూ ఉచితంగా సేవలందిస్తున్నామని పేర్కొన్నారు. కొత్త వాహనాలతో సకాలంలో ఆసుపత్రులకు రోగులను తరలించే అవకాశం ఉంటుందన్నారు. రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి పనులు చూసి ఓర్వలేక కాంగ్రెస్, బీజేపీ తప్పుడు ఆరోపణలు చేస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. సర్పంచు పుస్కూరి జితేందర్‌రావు, ఎంపీపీ ముత్యాల కరుణశ్రీ, జెడ్పీటీసీ పుస్కూరి పద్మజా, సహకార సంఘాల పోరం జిల్లా అధ్యక్షుడు బలరాంరెడ్డి, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

### బోధనలో లక్ష్యాలు చేరుకోవాలి



కాల్వశ్రీరాంపూర్: మాట్లాడుతున్న డీఈవో

కాల్వశ్రీరాంపూర్/సుల్తానాబాద్/ఓదెల: విద్యార్థుల్లో కనీస సామర్థ్యాల పెంపుకోసమే తొలిమెట్టు కార్యక్రమాన్ని చేపట్టినట్లు డీఈవో మాధవి అన్నారు. బుధవారం కాల్వశ్రీరాంపూర్, సుల్తానాబాద్, ఓదెలలో తొలిమెట్టు శిక్షణ తరగతులను ప్రారంభించి మాట్లాడారు. ఉపాధ్యాయులు అంకితభావంతో పనిచేస్తేనే ప్రభుత్వ లక్ష్యం నెరవేరుతుందని, తద్వారా విద్యార్థులు లక్ష్యాలను చేరుకుంటారని అన్నారు. తొలిమెట్టును విజయవంతం చేయాల్సిన బాధ్యత ఉపాధ్యాయులు విస్మరించరాదన్నారు. కార్యక్రమాల్లో ఆయా స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### ప్రకృతి వనాల పరిశీలన



నర్సరీని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

ఎలిగేడు: మండలకేంద్రంలో జిల్లా అదనపు (స్థానికసంస్థల) కలెక్టర్ అరుణశ్రీ బుధవారం పర్యటించి పలు అభివృద్ధి పనులను పరిశీలించారు. నర్సరీ, పల్లె ప్రకృతివనం, పీహెచ్‌సీ, డ్రైనేజీలు, హరితహారం, పంచాయతీ రికార్డులు, పారిశుద్ధ్య పనులను పర్యవేక్షించారు. సర్పంచ్ భూర్ల సింధూజ, డీపీవో చంద్రమౌళి, డీఎఫ్‌వో శివయ్య, ఎంపీడీవో శ్రీనివాసమూర్తి, ఎంపీవో అనిల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ముందుగా మండలంలోని నర్సాపూర్, లోకపేటలో డీపీవో, డీఎఫ్‌వో పర్యటించారు. నర్సరీలు,పల్లెప్రకృతివనాలు, శ్మశానవాటికలు, ప్లాంటేషన్, పారిశుద్ధ్యం పనులను పరిశీలించారు.

### విదేశాలలో ఉద్యోగావకాశాలు

పెద్దపల్లిరూరల్: విదేశాల్లో ఉద్యోగావకాశాలు కల్పించేందుకు ఈనెల 5న ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధికల్పనాధికారి తిరుపతిరావు తెలిపారు. ఆస్ట్రేలియా, యూకే, జర్మనీ దేశాల్లో పనిచేసేందుకు నైపుణ్యం, ఆసక్తిగల అభ్యర్థులు ముందుకు రావాలని, ఈనెల 5న హన్మకొండలోని ప్రభుత్వ ఐటీఐ (ములుగురోడ్)లో ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్ ఉంటుందని పేర్కొన్నారు. అభ్యర్థులు తమ పేర్లను వెబ్‌సైట్, మొబైల్ యాప్, ఈమెయిల్ ద్వారా నమోదు చేసుకోవచ్చని వివరించారు. వివరాలకు సెల్ నంబర్లు 9701732697, 7893566493, 8328602231లో సంప్రదించాలని కోరారు.

### 8న జెడ్పీ స్థాయీసంఘ సమావేశాలు

పెద్దపల్లిరూరల్: ఈనెల 8న జెడ్పీ స్థాయీసంఘ సమావేశాలను జిల్లాకేంద్రంలోని జెడ్పీ కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు జెడ్పీ సీఈఓ శ్రీనివాస్ తెలిపారు. 8న 3, 5, 6వ స్థాయీ కమిటీల సమావేశాన్ని సంబంధిత స్థాయీసంఘం అధ్యక్షుల అధ్యక్షతన, మధ్యాహ్నం 1.30 గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు జెడ్పీ చైర్మన్ పుట్ట మధూకర్ అధ్యక్షతన 1, 2, 4, 7వస్థాయి కమిటీ సమావేశాలు ఉంటాయని పేర్కొన్నారు. 11న జెడ్పీ సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎన్టీపీసీ మిలీనియం హాల్‌లో జెడ్పీ చైర్మన్ పుట్ట మధూకర్ అధ్యక్షతన సమావేశం ఉంటుంది.

# మత్తు.. విచక్షణ చిత్తు




**నిరంతరం పర్యవేక్షిస్తున్నాం**



జిల్లాలో యువత చెడుదారిలో పడకుండా నిరతరం అసాంఘిక కార్యకలాపాలపై నిఘా ఉంచుతున్నాం. మత్తులో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడినా.. ఇతరులకు ఇబ్బందులు కలిగించినా వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటాం. పట్టుబడిన వారిలో యువత, విద్యార్థులే అధికంగా ఉంటున్నారు. వారికి తల్లిదండ్రుల సమక్షంలో కౌన్సెలింగ్ ఇస్తున్నాం.

– వైభవ్ గైక్వాడ్, డీసీపీ, పెద్దపల్లి

- పోలీసులు, ఎక్సైజ్‌శాఖ సమన్వయ లేమి ఫలితం
- గంజాయి, మద్యం మత్తులో పేట్రేగుతున్న ఆకతాయిలు

సాక్షి, పెద్దపల్లి: విచ్చలవిడిగా గంజాయి, లిక్కర్ వినియోగం అనేక దుష్పరిణామాలకు దారి తీస్తోంది. జిల్లావ్యాప్తంగా అన్ని ప్రాంతాల్లో అన్నివేళల్లో మద్యం, గంజాయి లభిస్తుండటంతో ఆయా మత్తులో ఆకతాయిలు నానా హంగామా సృష్టిస్తున్నారు. రాత్రిపూట ఇష్టారాజ్యంగా సంచరిస్తూ తారసపడిన వారిపై దాడులకు తెగబడుతున్నారు. రాత్రి 11 గంటలు దాటితే అడ్డాల్లో ఆకతాయిలు గుంపులుగా సంచరిస్తున్నారు. గంజాయి, మద్యం తాగేందుకు శివారుప్రాంతాలను ఎంచుకుంటున్నారు. మత్తులో రాత్రిపూట విధులు నిర్వర్తించే ఉద్యోగులు, బాటసారులపై దాడులకు తెగబడుతున్నారు. డబ్బులు ఇవ్వాలంటూ బెదిరిస్తున్నారు. జేబుల్లోని పర్సులు, సెల్‌ఫోన్లు లాక్కుంటున్నారు. రాత్రిపూట విధులు ముగించుకుని ఇంటికి వచ్చే వారు హడలిపోతున్నారు. మరోవైపు మత్తులో ప్రమాదాలబారిన పడుతున్నారు. ఇటీవల ఈ సంస్కృతి జిల్లాల.. ముఖ్యంగా గోదావరిఖనిలో విచ్చలవిడిగా పెరిగింది.



**గంజాయి విక్రయాలు, వినియోగం అధికం**

గోదావరిఖనిలో గంజాయి విక్రయాలతోపాటు వినియోగం ప్రమాదకర స్థాయిలో కొనసాగుతోంది. గతంలో పెద్దలకు మాత్రమే పరిమితమైన గంజాయి విక్రయం, వినియోగం ఇప్పుడు మైనర్లను సైతం తాకింది. సింగరేణి ఉద్యోగులు అధికంగా ఉండే గోదావరిఖని, యైటింక్లయిన్‌కాలనీ, సెంటనరీకాలనీ, బెల్లంపల్లి, శ్రీరాంపూర్, మంచిర్యాల, నస్పూర్, సీసీకాలనీలకు చెందిన యువత టార్గెట్‌గా గంజాయి దందా కొనసాగుతోంది. అలాగే జిల్లాలోని సుల్తానాబాద్, పెద్దపల్లి రైల్వేస్టేషన్ పరిసరాలు గంజాయి విక్రయాలకు అడ్డాలుగా మారాయి. పక్కనే ఉన్న ఉమ్మడి ఆదిలాబాద్, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ నుంచి నేరుగా గోదావరిఖని కేంద్రానికి సరఫరా చేస్తున్నారు. ఇక్కడ విక్రయించడంతో పాటు ఇతర ప్రాంతాలకు తరలించేందుకు అడ్డాగా మార్చుకుంటున్నారు. ఇక్కడి యువత మత్తుకోసం లిక్విడ్ గంజాయి వినియోగిస్తున్నారంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు.

**బెల్ట్‌షాపుల్లో ఎనీటైం మద్యం**

జిల్లాలో పెరుగుతున్న నేరాలకు ప్రధాన కారణాల్లో మద్యం ఒక్కటి. మద్యం మత్తులో కొందరు పెడదారిపడుతున్నారు. దాడులకు పాల్పడుతున్నారు. జిల్లాలో ఏ గల్లీకి చూసినా ఒక్కటికి మించి బెల్ట్ దుకాణాలున్నాయి. కిరాణా దుకాణాలు, రోడ్ల వెంబడి హోటళ్లు, దాబాల్లో ఏ సమయంలోనైనా మద్యం దొరుకుతోంది. మద్యం తాగిన మత్తులో క్షణికావేశంలో నేరాలకు పాల్పడుతున్నారు. ఎక్సైజ్, పోలీసుశాఖలు సమన్వయంతో కలిసి పనిచేయకపోవడంతో సంబంధింత అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని ఆరోపణలున్నాయి. దీంతోనే నేరాలకు అడ్డుకట్టు పడటం లేదు. ఎక్సైజ్ అధికారులు మద్యం సేల్స్ తగ్గకుండా ఉండేందుకు బెల్టుదుకాణాలు వైపు కన్నెత్తి చూడటం లేదు. దీంతో బెల్ట్‌దుకాణాలు అడ్డుఅదుపులేకుండా కొనసాగుతున్నాయి. ఇదే విషయమై ఎక్సైజ్ అధికారులను వివరణ కోరగా బెల్ట్ దుకాణాల నియంత్రణకు చర్యలు తీసుకుంటున్నామని, ఫిర్యాదు చేస్తే వెంటనే అక్కడికి వెళ్లి తనిఖీలు నిర్వహించి మూసేస్తున్నామని తెలిపారు.

## ఆపదలో ఉన్నవారి ప్రాణాలు కాపాడారు

- కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్
- గోపాలపురం మత్స్యకారులకు నగదు పారితోషికం

పెద్దపల్లిరూరల్: వరదలో చిక్కుకుని ఇబ్బంది పడిన వారిని సురక్షితంగా కాపాడిన మత్స్యకారులను కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ అభినందించారు. మంథని మండలం గోపాలపురం గ్రామం మానేరువాగు వద్ద 19మంది ప్రాణాలను కాపాడిన శ్రీనివాస్, రవి, వెంకటేశ్, సందీప్‌కుమార్, సాయివంశీని డీసీపీ వైభవ్‌గైక్వాడ్‌తో కలిసి కలెక్టర్ రూ.5వేల నగదు పురస్కారం అందించి శాలువాతో సత్కరించారు. వారి కుటుంబ నేపథ్యం, ఆర్థిక స్థితిగతులపై ఆరా తీసి మత్స్యకార సొసైటీల్లో సభ్యత్వం తీసుకోవాలన్నారు. మంథని ఆర్డీఓ హనుమనాయక్, ఏఓ రవీందర్, ఇన్‌చార్జి తహసీల్దార్ గిరి ఉన్నారు.

**ఇంటింటా ఇన్నోవేటర్ పోస్టర్ ఆవిష్కరణ**

ఈనెల 5వరకు ఇంటింటా ఇన్నోవేటర్ కార్యక్రమంలో పాల్గొనేందుకు ఆసక్తిగల వారు తమ వివరాలు



మత్స్యకారులను సత్కరిస్తున్న కలెక్టర్

పంపాలని కలెక్టర్ కోరారు. ఇంటింటా ఇన్నోవేటర్ -2023 పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఆవిష్కరణలో తమ ప్రతిభను చూపేందుకు వీలుగా ప్రభుత్వం నాలుగేళ్లుగా ఇంటింటా ఇన్నోవేషన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తోందన్నారు. 2019 నుంచి వరుసగా జిల్లా నుంచి మంచి ప్రదర్శనలు ఇచ్చి మంచి పేరు తెచ్చారన్నారు. ఆవిష్కర్తలు తమ పూర్తి వివరాలను సెల్ నంబరు 9100678543కు వాట్సాప్ చేయాలని సూచించారు. పూర్తి వివరాలకు సెల్‌నంబరు 9951504622లో జిల్లా సైన్స్‌అధికారి రవినందన్ రావును సంప్రదించాలన్నారు. ఈడీఎం కవిత, రవినందన్‌రావు ఉన్నారు.

### కళ్ల కలకపై జాగ్రత్తలు అవసరం

పెద్దపల్లిరూరల్: కళ్ల కలక వ్యాధి వ్యాప్తి చెందకుండా జాగ్రత్తలు పాటించాలని డీఎంహెచ్ఓ ప్రమోద్ కుమార్ అన్నారు. వ్యాధి ఉన్నవారికి దూరంగా ఉండాలన్నారు. వాళ్ల వినియోగించిన వస్తువులను తాకడం, వాడడం చేయవద్దన్నారు. అవసరమైన యాంటీ బయాటిక్స్ మందులు, ఐ డ్రాప్స్ అందిస్తామన్నారు. జిల్లాలోని అన్ని గ్రామాల్లో ఇంటింటికి వెళ్లి ఫీవర్ సర్వే నిర్వహిస్తున్నట్లు తెలిపారు.



### బీఆర్‌ఎస్‌కు 'బిరుదు' గుడ్‌బై..

- ఎమ్మెల్యే ఒంటెత్తుపోకడతో పార్టీని వీడుతున్నట్లు ప్రకటన
- ఆయన వెంటే మున్సిపల్ మాజీ చైర్మన్ ఎల్.రాజయ్య

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి ఒంటెత్తుపోకడలతో పార్టీ నాయకులు, ప్రజలు అసహనంతో ఉన్నారని, అందుకే పార్టీని వీడుతున్నామని మాజీ ఎమ్మెల్యే బిరుదు రాజ మల్లు, పెద్దపల్లి మున్సిపల్ మాజీ చైర్మన్ ఎల్.రాజయ్య తెలిపారు. బీఆర్‌ఎస్‌ను వీడి.. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపుకోసం పాటుపడతామని ప్రకటించారు. జిల్లాకేంద్రంలో బుధవారం విలేకరులతో మాట్లాడారు. ఈనెల 4 టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి సమక్షంలో.. మాజీ ఎమ్మెల్యే విజయరమణా రావు ఆధ్వర్యంలో పార్టీలో చేరనున్నట్లు తెలిపారు. సమావేశంలో ఎంపీటీసీ కలవేన మహేందర్, పుప్పాల శ్రీనివాస్, పెంచాల మల్లయ్య, మానుపాటి శ్రీనివాస్, అమిరిశెట్టి రామస్వామి, పడాల శ్రీనివాస్, ఎడెల్లి శంకర్, తూముల శ్రీనివాస్, సుభాష్‌రావు, విజేందర్‌రెడ్డి తదితరులున్నారు.

# 'నులి'పేద్దాం రండి..!

- నేటినుంచి 10 వరకు మాత్రల పంపిణీ
- ఏర్పాట్లు చేసిన వైద్యశాఖ
- ఇప్పటికే చిన్నారుల గుర్తింపు
- జిల్లావ్యాప్తంగా 2,19,500 మంది
- సిద్ధంగా ఉన్న మాత్రలు 2,41,450

సుల్తానాబాద్: చిన్నారుల్లో నులిపురుగుల నిర్మూలనకు మాత్రలు పంపిణీ చేసేందుకు జిల్లా వైద్యశాఖ సిద్ధమైంది. జిల్లావ్యాప్తంగా ఈనెల మూడో తేదీ నుంచి 10వరకు ఇంటింటికీ తిరిగి ఉచితంగా మాత్రలు పంపిణీ చేసేలా ఆరోగ్య సిబ్బందిని అప్రమత్తం చేసింది. జాతీయ బోదకాలు నియంత్రణ దినోత్సవం సందర్భంగా బోదకాలు వ్యాధి, నులిపురుగుల నిర్మూలనకు సామూహికంగా డీఈసీ, ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేపట్టనున్నారు. నులిపురుగుల నివారణ మాత్రలు వేసుకునేందుకు జిల్లాలో 2,19,500మందిని గుర్తించారు. వీరి కోసం ప్రభుత్వం ఆల్బెండజోల్ మాత్రలను 2,41,450 జిల్లాకు సరఫరా చేసింది. మాత్రలు వేసేందుకు 706 మంది బృందాలను ఎంపిక చేశారు. ఒక్కో బృందంలో ఆశాకార్యకర్త, అంగన్‌వాడీ టీచర్ ఉంటారు. వీరు ఇంటింటికీ తిరిగి మాత్రలు వేయించాల్సి ఉంటుంది. ఇప్పటికే వీరితో వైద్యాధికారులు సమావేశమై తగిన సూచనలు ఇచ్చారు.

**కార్యక్రమం నేడు ప్రారంభం**

జిల్లాకేంద్రం శివారు రంగంపల్లిలోని మైనార్టీ బాలికల పాఠశాలలో గురువారం 10 గంటలకు ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నట్లు డీఎంహెచ్‌వో ప్రమోద్‌కుమార్ తెలిపారు. కార్యక్రమానికి మంత్రి కొప్పుల ఈశ్వర్, కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ దాసరి మమతారెడ్డి, జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి కృపాబాయి, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొననున్నారు.



మాత్రలు వేసుకునే విధానం తెలిపే పోస్టర్

**పంపిణీ తీరు**

- బోదకాలు వ్యాధి దోమల ద్వారా ఒక్కరి నుంచి మరొకరికి వ్యాప్తి చెందుతుంది. కాలు, చేయి, రొమ్ము, పురుష, స్త్రీ జననాంగాల్లో వాపు ఉంటుంది. ఈ వ్యాధి రాకుండా డీఈసీ మాత్రలు వేస్తారు.
- రెండు నుంచి ఐదేళ్ల వయస్సు వారికి 100 ఎంజీ ఒక మాత్ర, ఆరు నుంచి 14 ఏళ్ల వారికి 100 ఎంజీ రెండు మాత్రలు, 15ఏళ్లు పైబడిన వారికి 100 ఎంజీ మూడు మాత్రలు వేయనున్నారు.
- నులిపురుగుల నిర్మూలనకు రెండేళ్లుపైబడిన వారందరికీ ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేయనున్నారు.
- ప్రతి ఒక్కరికీ 400ఎంజీల మాత్ర పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేశారు.

**ఏర్పాట్లు చేశాం..**

బోదకాలు, నులిపురుగుల నిర్మూలనకు మాత్రలు పంపిణీ చేసేందుకు అన్ని ఏర్పాట్లు చేశాం. ఇంటింటికీ వెళ్లి డీఈసీ, ఆల్బెండజోల్ మాత్రలను ఆరోగ్య సిబ్బంది అందిస్తారు. భోజనం తిన్న తర్వాతనే వీటిని మింగాలి. అపోహలు లేకుండా అర్హులందరూ మాత్రలు వేసుకోవాలి. రెండేళ్లలోపు పిల్లలు, దీర్ఘకాలిక వ్యాధులున్నవారు, గర్భిణులు వేసుకోవద్దు.



– ప్రమోద్ కుమార్, డీఎంహెచ్‌వో

# మద్యం టెండర్లకు వేళాయే

- జిల్లాలో 77 వైన్స్‌షాపులకు షెడ్యూల్ విడుదల
- ఈనెల 4న నోటిఫికేషన్
- 18వరకు దరఖాస్తుల స్వీకరణ
- 21న డ్రా నిర్వహణ

సాక్షి, పెద్దపల్లి: వచ్చే రెండేళ్లకుగాను మద్యం షాపుల లైసెన్స్ జారీకి టెండర్ల ప్రక్రియ ప్రారంభించేందుకు రాష్ట్ర ప్రభుత్వం షెడ్యూల్ విడుదల చేసింది. తొలుత గురువారం జిల్లాలోని 77 మద్యం దుకాణాల్లో రిజర్వ్ దుకాణాలను గుర్తించేందుకు కలెక్టర్ డ్రా తీయనున్నారు. శుక్రవారం టెండర్ల స్వీకరణకు నోటిఫికేషన్ జారీ చేయనున్నారు. ఈనెల 4 నుంచి 18న సాయంత్రం 6గంటల వరకు టెండర్లు వేసేందుకు అవకాశం కల్పించారు. గతేడాది మాదిరిగానే ఈయేడాది కూడా గౌడ కులస్తులకు 15 శాతం, ఎస్సీలకు 10 శాతం, ఎస్టీలకు 5 శాతం మద్యం షాపులను రిజర్వు చేయాలని నిర్ణయించింది. దీనికనుగుణంగా జిల్లా యూనిట్‌గానే తీసుకుని గౌడ్స్‌కు 13, ఎస్సీలకు 8, జనరల్‌కు 56 షాపులు కేటాయించనున్నారు. ఎస్టీ నోటిఫైడ్ ఏరియాలు లేకపోవడంతో ఎస్టీలకు షాపులను కేటాయించలేదు. మద్యం పాలసీలో కొత్తగా మార్పులేమీ తీసుకరాకపోగా.. పాత పాలసీనే కొనసాగిస్తున్నారు. గతేడాది 77దుకాణాలకు 1058 దరఖాస్తులతో రూ 21.16 కోట్ల ఆదాయం వచ్చింది. ఈసారి అసెంబ్లీ, పార్లమెంట్, స్థానిక సంస్థల ఎన్నికలు ఉన్న నేపథ్యంలో దరఖాస్తులు గతేడాది కంటే ఎక్కువ వచ్చే అవకాశం ఉంది. షాపుల కోసం దరఖాస్తు చేసుకునేందుకు ఒక్కో దరఖాస్తుకు రూ.2లక్షలు తీసుకోనున్నారు. ఈ ఫీజు నాన్‌రీఫండ్. రిజర్వుచేసిన 21 షాపులకు ఆ కేటగిరీకి చెందిన వర్గాలే దరఖాస్తు చేసుకోవాలి. మిగతా 56 షాపులకు అన్ని వర్గాల వారూ వాళ్ల దరఖాస్తు చేసుకోవచ్చని అధికారులు పేర్కొన్నారు. ఈనెల 18వరకు టెండర్లు స్వీకరించి, 21న అందరి సమక్షంలో డ్రా తీయనున్నారు. కొత్త షాపులకు జారీచేసే లైసెన్సులు డిసెంబర్ 01 నుంచి 2025 నవంబర్ 30 వరకు అమల్లో ఉండనున్నాయి.

## 'ఇళ్ల'ను చూస్తామంటే వణుకెందుకు..?

పెద్దపల్లిరూరల్: జిల్లాలో డబుల్ బెడ్ రూం ఇళ్ల పరిస్థితిని తెలుసుకుందామంటే రాష్ట్రప్రభుత్వానికి వణుకు పుట్టిందని, అందుకే పోలీసులతో నిర్బంధం కొనసాగిస్తున్నారని మాజీ ఎమ్మెల్యే గుజ్జుల రామకృష్ణారెడ్డి అన్నారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వం ఎంపిక చేసిన లబ్ధిదారులకు ఇళ్లను పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. గతంలో చంద్రకళ సారథ్యంలో ఇళ్లను స్వాధీనం చేసుకునేందుకు యత్నించినా అధికారులు అడ్డుకున్నారని, నిరుపేదలకు ఇళ్లు ఇస్తరా..? లేదా..? స్పష్టం చేయాలన్నారు. నాయకులు కన్నం అంజయ్య, కొంతం శ్రీనివాస్‌రెడ్డి, ఠాకూర్ రాంసింగ్, పిన్నింటి రాజు, శ్రీనివాసరావు, సమ్మయ్య, నరేశ్, రమేశ్, సదానందం, కరుణాకర్, కుమార్, ఫహీం, నారాయణస్వామి, ఓదెలు, విజయ్, మల్లారెడ్డి చంద్రయ్య తదితరులున్నారు.



గృహనిర్బంధం చేస్తున్న ఎస్సై మహేందర్

# ఎన్నాళ్లకెన్నాళ్లకు!

- రుణమాఫీకి లైన్‌క్లియర్
- నేటి నుంచి సదరు ప్రక్రియ
- ఉమ్మడి జిల్లాలో 3.49 లక్షల మందికి లబ్ధి

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: సుదీర్ఘ నిరీక్షణ అనంతరం అన్నదాతల ఆశలు ఫలించాయి. లక్షలోపు రుణమాఫీ చేస్తామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించగా సదరు ప్రక్రియ నాలుగేళ్ల అనంతరం తుదిదశకు చేరుకోవడం గమనార్హం. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ప్రధానమైంది సాగురంగమే. ఉభయ గోదావరి జిల్లాలతో పోటీపడే ఉమ్మడి కరీంనగర్‌ది ప్రత్యేక ముద్ర. ప్రధానంగా వరి, పత్తి, మొక్కజొన్న, పసుపు, చెరకు పంటలకు ప్రసిద్ధి కాగా చిన్న, సన్నకారు రైతులే ఎక్కువ. ఈక్రమంలో బ్యాంకు రుణంతోనే ఏటా రెండు పంటలను సాగు చేస్తుంటారు. అయితే అతివృష్టి లేదా అనావృష్టి అన్నదాతలను ఆందోళనకు గురిచేస్తుండగా దిగుబడులు ఒక్కోసారి దిగదుడుపే. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ప్రకటించే రుణమాఫీ ప్రకటనే రైతులకు ఒకింత ధైర్యాన్నిస్తుండగా మాఫీ అమలు ఆగుతూ సాగింది. 2018 డిసెంబర్ 11వరకు రూ.లక్షలోపు రుణం తీసుకున్న రైతులకు రుణమాఫీ ప్రకటించగా ఉమ్మడి జిల్లాలో 3,49,474 మంది లబ్ధి చేకూరనుంది. రూ.1200 కోట్ల మేర రుణమాఫీ జరగనుంది.




**ఆగుతూ సాగిన ప్రక్రియ**

టీఆర్‌ఎస్ ప్రభుత్వం నాలుగు విడతలుగా మాఫీ చేస్తామని గతంలో ప్రకటించింది. రూ.25 వేలలోపు రుణం తీసుకున్న రైతులకు ఒకసారి, రూ.50 వేల లోపు మరోసారి, రూ.75 వేలు, రూ.లక్ష చివరిసారి ఇలా నాలుగు విడతలుగా మాఫీ ఇలా 2019లోనే సదరు ప్రక్రియ పూర్తికావాలి. కానీ.. కేవలం రూ.25 వేల లోపు రుణం తీసుకున్నవారికి మాత్రమే మొదటి విడత మాఫీ చేశారు. ఆ తర్వాత మిగతా ప్రక్రియ ఆగిపోయింది. ఓసారి సమాచారం సేకరించడం మళ్లీ అటకెక్కించడం చేశారు. మొదటి విడతలో కరీంనగర్ జిల్లాలో 15,200 మంది లబ్ధిపొందగా రాజన్న సిరిసిల్ల జిల్లాలో 4,663, పెద్దపల్లి జిల్లాలో 14,636, జగిత్యాల జిల్లాలో 27 వేల మందికి మాత్రమే రుణమాఫీ జరిగింది.

**వడ్డీ డబ్బులు తిరిగొచ్చేనా?**

ఉమ్మడి జిల్లావ్యాప్తంగా కర్షకులు రుణమాఫీ కోసం నిరీక్షిస్తున్నారు. ప్రభుత్వం నాలుగు విడతల్లో మాఫీ చేస్తుందని ప్రకటించడంతో చాలామంది రుణాలు తిరిగి చెల్లించలేదు. వడ్డీ డబ్బులు కడుతూ వచ్చారు. మొత్తంగా రూ.400ల కోట్ల వరకు వడ్డీ చెల్లించినట్లు సమాచారం. ధాన్యం డబ్బులు ఖాతాలో జమైతే చాలు బ్యాంకర్లు వాటిని రుణానికి మిత్తికింద జమచేశారు. కరీంనగర్, రాజన్న సిరిసిల్ల, పెద్దపల్లి, జగిత్యాల జిల్లాల్లో 50 శాతానికి పైగా రైతులది ఇదే పరిస్థితి. 2019లోనే పూర్తిగా రుణమాఫీ జరగాల్సి ఉండగా నాలుగేళ్లుగా వడ్డీ డబ్బులు చెల్లించి రెన్యువల్ చేసుకున్నారు. ఈ క్రమంలో సదరు డబ్బులు కూడా రైతుల ఖాతాలో జమచేయాలని డిమాండ్ చేస్తున్నారు. లేకుంటే మాఫీ చేసినా పెద్దగా రైతులకు ఒరిగిందేమి లేదని అభిప్రాయపడుతున్నారు. కరీంనగర్ జిల్లాలో 76,791 మందికి ఇంకా రుణమాఫీ కావాల్సి ఉండగా రాజన్న సిరిసిల్ల 57,210, పెద్దపల్లి 78,064, జగిత్యాల జిల్లాలో 76 వేల మంది రైతులు ఇప్పటికీ రెన్యువల్ కింద వడ్డీ చెల్లిస్తూ రుణాలు తీసుకుంటున్నారు.

**రైతుబాంధవుడు సీఎం కేసీఆర్**



దేశంలో ఏ రాష్ట్రం చేపట్టని విధంగా, రైతాంగ అభివృద్ధి కోసం సీఎం కేసీఆర్ తీవ్రంగా కృషి చేస్తున్నారు. రుణమాఫీకి కార్యాచరణ రూపొందించడంపై కేసీఆర్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నా. కరోనా వంటి విపత్కర పరిస్థితులు, ఎఫ్‌ఆర్బీఎం పరిమితులు, నోట్ల రద్దు, జీఎస్టీ వంటి కేంద్ర అనాలోచిత నిర్ణయాలతో రాష్ట్ర ఆదాయం పడిపోయినా తెలంగాణలో రైతుల కోసం నిరంతరాయంగా కృషి చేస్తున్నారు. నేడు రూ. 19వేల కోట్ల భారాన్ని భరిస్తూ తీసుకున్న రైతు రుణమాఫీ నిర్ణయం విప్లవాత్మకం. ఇవే కాకుండా రైతుబంధు, రైతుబీమా, ఉచిత కరెంట్, నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, కాళేశ్వరం జలాలతో రాష్ట్రాన్ని ధాన్యగారంగా తీర్చిదిద్దారు.

– గంగుల కమలాకర్, రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి

**ఉమ్మడి జిల్లాల వారీగా రుణమాఫీ ఇలా..**

| జిల్లా | అర్హులు | మొదటివిడత మాఫీ | ఇంకా కావాల్సినవారు |
|---|---|---|---|
| కరీంనగర్ | 91,991 | 15,200 | 76,791 |
| రాజన్నసిరిసిల్ల | 61,783 | 4,663 | 57,210 |
| పెద్దపల్లి | 92,700 | 14,636 | 78,064 |
| జగిత్యాల | 1,03,000 | 27,000 | 76,000 |



## క్లుప్తంగా

### అదనపు కలెక్టర్‌ను కలిసిన ఆర్జీ–3 జీఎం



అదనపు కలెక్టర్‌కు మొక్కను అందజేస్తున్న ఆర్జీ–3 జీఎం సుధాకర్ రావు

కమాన్‌పూర్(మంథని): జిల్లా అదనపు కలెక్టర్‌గా ఇటీవల బాధ్యతలు చేపట్టిన వి.శ్యాంప్రసాద్‌లాల్‌ను ఆర్జీ–3 జీఎం కె.సుధాకర్ రావు బుధవారం జిల్లా కేంద్రంలోని కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఆర్జీ–3 ఏరియాలో చేపడుతున్న గనుల విస్తరణలో రెవెన్యూ పనులకు సహకారం అందించాలని జీఎం కోరారు. జీఎం వెంట సీనియర్ ఎస్టేట్ అధికారి ఐలయ్య, తదితరులున్నారు.

### ఘనంగా 'మిర్యాల' జన్మదిన వేడుకలు

యైటింక్లయిన్‌కాలనీ: ఆర్జీ–2 ఏరియా యైటింక్లయిన్ కాలనీ టీబీజీకేఎస్ కార్యాలయంలో టీబీజీకేఎస్ గుర్తింపు సంఘం ప్రధాన కార్యదర్శి మిర్యాల రాజిరెడ్డి జన్మదిన వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. టీబీజీకేఎస్ ఆర్జీ–2 వైస్ ప్రెసిడెంట్ ఐలి శ్రీనివాస్ నాయకులతో కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో జీఎం కమిటీ సభ్యులు నాయకులు ప్రభాకర్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, నాయకులు మల్లేశ్వరరావు, మల్లికార్జున్, వెంకట్, సంపత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### వినతిపత్రం అందజేత



వినతిపత్రం అందజేస్తున్న సంఘం నాయకులు

గోదావరిఖని టౌన్: ఎస్సీ కుల సర్టిఫికెట్లలో నేతకాని పేరులోని మార్పులను సవరించాలని ఎస్సీ, ఎస్టీ కార్పొరేషన్ చైర్మన్ రాహుల్ బొజ్జకు నేతకాని మహర్ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దుర్గం రాజేశ్ బుధవారం హైదరాబాద్‌లో వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వ గెజిట్‌లో సరిచేసి జిల్లా కలెక్టర్ల నుంచి తహసీల్దార్లకు ఆదేశాలు జారీచేయాలని కోరినట్లు పేర్కొన్నారు. దీనికి ఆయన సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. సంఘం నాయకులు దుర్గం నర్సయ్య, దీపక్ కుమార్, ప్రకాశ్, నర్సయ్య, రాజమల్లు, రవీందర్, గంగాధర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

# మరో నాలుగు అంబులెన్స్‌లు

- మంథని, ధర్మారానికి 108లు
- పెద్దపల్లి, మంథనికి రెండు 102 వాహనాలు
- సకాలంలో అందనున్న వైద్యసేవలు



మంథనికి మంజూరైన 108 వాహనం



అమ్మఒడి వాహనం

మంథని: ఆరోగ్య తెలంగాణే లక్ష్యంగా పనిచేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రంలో 466 అంబులెన్స్‌లను ప్రారంభించగా అందులో జిల్లాకు కొత్త నాలుగు అంబులెన్స్‌లు కేటాయించారు. ఇందులో మంథని, ధర్మారంకు 108 వాహనాలు, మంథని, పెద్దపల్లి మాతా శిశు ఆస్పత్రికి అమ్మఒడి వాహనాలు మంజూరు చేశారు. దీంతో అత్యవసర వైద్యసేవలు మరింత వేగంగా అందే అవకాశం ఉంది.

**16 ఏళ్ల తర్వాత..**

దివంగత సీఎం వైఎస్. రాజశేఖర్ రెడ్డి హయాంలో 2007లో మంథనికి నూతన అంబులెన్స్ మంజూరు కాగా మళ్లీ కొత్తగా కేటాయిం లేదు. తరచూ మరమ్మతులతో రోగులు ఎన్నోసార్లు ఇబ్బందులు పడ్డ సందర్భాలూ ఉన్నాయి. రోజుల తరబడి సేవలకు అంతరాయం కూడా ఏర్పడింది. మంథనికి 108 వాహనం అందుబాటులో లేకపోవడంతో, కమాన్‌పూర్, ఎనిమిదో కాలనీ, పెద్దపల్లి, గోదావరిఖని వాహనసేవలు వినియోగించారు. ఇవి సకాలంలో రాకపోడంతో ఆస్పత్రులకు వెళ్లాలంటే నిరుపేద ప్రజలు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొనేవారు. నూతన అంబులెన్స్ వాహనం మంజూరు కావడంతో ఈప్రాంత ప్రజలు ఏదైనా అత్యవసర సమయంలో ఆస్పత్రికి చేరేందుకు వీలుగా ఉంటుంది.

**మూడు మండలాలకు సేవలు**

మంథని, ముత్తారంతో పాటు జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని మల్హర్ మండలానికి మంథనికి 108 వాహనం సేవలందిస్తుంది. నూతన వాహనం అందుబాటులోకి వస్తే మరింత మందిని అత్యవసర సమయాల్లో ఆస్పత్రులకు చేరవేసేందుకు వీలుగా ఉంటుందని 108 సిబ్బంది తెలుపుతున్నారు.

# కన్నకొడుకే కాలయముడు

- భూమి కోసం తల్లిని చంపిన తనయుడు



కనుకవ్వ (ఫైల్)



కనుకవ్వ మృతదేహం వద్ద రోదిస్తున్న కూతురు

తిమ్మాపూర్(మానకొండూర్): కన్న కొడుకే కాలయముడయ్యాడు. నవమాసాలు మోసి, కని, పెంచిన తల్లి తమ్మనవేణి కనుకవ్వ(60)ను భూమికోసం దారుణంగా హత్య చేశాడు. ఈ ఘటన కరీంనగర్ జిల్లా గన్నేరువరం మండలం జంగపల్లి గ్రామంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. తిమ్మాపూర్ మండలం రేణికుంట గ్రామానికి చెందిన తమ్మనవేణి కనుకవ్వ(60)కు ముగ్గురు కూతుళ్లు, కుమారుడు వినోద్ ఉన్నాడు. భర్త గతంలోనే చనిపోవడంతో అన్నీతానై పిల్లలను సాకి ప్రయోజకులను చేసింది. కూతుళ్లు, కుమారుడి వివాహాలు చేసింది. భర్త తరఫున వచ్చిన ఎకరం భూమిని తన కొడుకు వినోద్ పేరిట రిజిస్ట్రేషన్ చేసింది. తనతల్లిగారి తరఫున వచ్చిన రెండెకరాల్లో వ్యవసాయం చేసుకుంటూ చిన్నకూతురుతో కలిసి ఉంటోంది. కొద్దిరోజులుగా తల్లిగారిల్లు రేణికుంటలో ఒక్కతే అద్దెకు ఉంటోంది.

**రెండెకరాలపై కన్నేసి..**

తండ్రి తరఫున వచ్చిన ఎకరం తీసుకున్న కొడుకు వినోద్.. కనుకవ్వ పుట్టింటివారు ఇచ్చిన భూమి కూడా తనకే కావాలని రెండేళ్లుగా గొడవ పడుతున్నాడు. అది కూతుళ్లకు ఇస్తుందనే అనుమానంతో గతేడాది పంటలు వేయకుండా అడ్డుకున్నాడు. అయినా తల్లి భూమి రిజిస్ట్రేషన్ చేయలదు. దీంతో ఈ ఏడాది బలవంతంగా భూమి లాక్కుని, కౌలుకు ఇచ్చాడు. దీంతో గొడవలు పెద్దవయ్యాయి.

**గండ్లు పూడ్చేందుకు వెళ్లి**

ఇటీవల కురిసిన వర్షాలకు వరద పోటెత్తడంతో జంగపల్లి శివారులోని వ్యవసాయ భూమిలో గండ్లు పడ్డాయి. వాటిని పూడ్చేందుకు వినోద్ బుధవారం ఉదయం వెళ్లాడు. ఈ విషయం తెలుసుకున్న కనుకవ్వ కూడా పొలం వద్దకు వెళ్లింది. తన భూమిలో ఎందుకు సాగు చేస్తున్నావని కొడుకును అడిగింది. ఈక్రమంలో ఇద్దరి మధ్య మాటామాట పెరిగింది. ఆవేశానికి లోనైన వినోద్.. తన చేతిలోని పారతో తల్లి తలపై బలంగా కొట్టాడు. దీంతో కనుకవ్వ తీవ్రగాయాలతో అక్కడికక్కడే కుప్పకూలి మృతిచెందింది. కూతుళ్లు ఇచ్చిన సమాచారం మేరకు తిమ్మాపూర్ సీఐ ఇంద్రసేనారెడ్డి, ఎల్ఎండీ, గన్నేరువరం ఎస్సైలు ప్రమోద్‌రెడ్డి, నర్సింహారావు ఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. వినోద్‌పై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

# అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే చందర్

కోల్‌సిటీ: రామగుండం కార్పొరేషన్‌లో అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలని ఎమ్మెల్యే కోరుకంటి చందర్ తెలిపారు. సీఎంఏ ప్లాన్ గ్రాంట్స్, డీఎంఎఫ్‌టీ, ఏసీడీపీ నిధులతో చేపట్టిన పనుల పురోగతిపై మేయర్ బంగి అనిల్ కుమార్, జిల్లా అదనపు (స్థానిక సంస్థలు) కలెక్టర్ అరుణశ్రీతో కలిసి మున్సిపల్, ఆర్అండ్‌బీ, పంచాయత్ రాజ్, టీఎస్‌ఈడబ్ల్యూ, ఐడీసీ, ఇంజినీరింగ్ అధికారులు, కాంట్రాక్టర్లతో కార్పొరేషన్ కార్యాలయంలో సమీక్షించారు. పనుల పూర్తికి ఎదురవుతున్న ఇబ్బందులను తమ దృష్టికి తీసుకొస్తే పరిష్కరించడానికి అవకాశం ఉంటుందన్నారు. సీనియర్ సిటిజన్ హాల్స్, మహిళా కమ్యూనిటీ హాల్‌కు స్థలం మంజూరు చేయాలని, లభ్యంకాని పక్షంలో ఆ నిధులతో ప్రజలకు అవసరమైన మరో అభివృద్ధి పని చేపట్టాలని అన్నారు. కాంట్రాక్టర్లను సంప్రదించి పనులు పూర్తి చేయించాలని ఆదేశించారు. పలుమార్లు టెండర్లు పిలిచినా కాంట్రాక్టర్లు ముందుకు రాని పక్షంలో కలెక్టర్ అనుమతితో ఆసక్తి ఉన్నవారికి నామినేషన్ ప్రాతిపదికన అప్పగించాలన్నారు. డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణాన్ని సైతం ఈనెల 15 లోగా పూర్తి చేయడానికి చర్యలు తీసుకోవాలన్నారు. భారీ వర్షాలకు ధ్వంసమైన రోడ్లను పునరుద్ధరించడానికి అంచనాలు రూపొందించాలన్నారు. పనులు పూర్తి చేస్తే కాంట్రాక్టర్లకు బిల్లులు కూడా త్వరగా చెల్లించేలా చూస్తామని అరుణశ్రీ స్పష్టం చేశారు. కార్పొరేటర్లు బాల రాజ్‌కుమార్, కల్వచర్ల కృష్ణవేణి, జనగామ కవితాసరోజినీ, కమిషనర్ (ఎఫ్ఏసీ) సుచరణ్, ఆర్అండ్‌బీ అధికారులు నరసింహాచారి, జాఫర్, జావీద్, పంచాయత్ రాజ్ ఇంజినీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

**పశువైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి**

పాలకుర్తి: పశువులకు సీజనల్‌లో వచ్చే వ్యాధులపై రైతులు అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే చందర్ అన్నారు. బుధవారం మండలంలోని పుట్నూర్‌లో పశువైద్య శిబిరాన్ని చందర్ ప్రారంభించారు. ఈ ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. పశువైద్య శిబిరాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో మండల పశువైద్యాధికారి ఖాన్, కల్యాణి, వెటర్నరీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## కొత్తూర్ లో పశువైద్య శిబిరం



గేదెకు టీకా వేస్తున్న సిబ్బంది

ధర్మారం: మండలంలోని కొత్తూరులో బుధవారం పశువైద్య శిబిరాన్ని జిల్లా పశు సంవర్థక శాఖ జిల్లా అధికారి రవీందర్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేసి నట్టల నివారణ మందును అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా అన్ని గ్రామాల్లో పశువైద్య శిబిరాలను ఏర్పాటు చేస్తున్నామని, రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ తాళ్ల మల్లేశం, పశువైద్యాధికారి కిశోర్, ఉపసర్పంచ్ రాజేశం, సిబ్బంది శంకర్, రాజేందర్, అహ్మద్ పాషా, గోపాలమిత్రులు రాజేశం, వెంకటేశం, మల్లేశం, అంజి, రమేశ్ పాల్గొన్నారు.

## వీడియో కాన్ఫరెన్స్



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న ఆర్జీ–1 జీఎం శ్రీనివాస్

గోదావరిఖని: కంటిన్యూస్ మైనర్ యంత్రాల పనితీరుపై సంస్థ సీఅండ్ఎండీ ఎన్. శ్రీధర్ బుధవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జీడీకే–11గనిలో ఎప్పటికప్పుడు కంటిన్యూస్ మైనర్ల ద్వారా బొగ్గు కటింగ్ పరిశీలిస్తున్నామనిజీఎం తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్‌లో ఆర్జీ–1 జీఎం చింతల శ్రీనివాస్, ఎస్ఓటూ జీఎం రాం మోహన్, డీజీఎం పర్సనల్ లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

## ఓసీపీ–2 సందర్శన



ఓసీపీ–2 గనిని పరిశీలిస్తున్న సేఫ్టీ జీఎం సాంబయ్య

కమాన్‌పూర్: ఆర్జీ–3 డివిజన్ ఏరియాలోని ఓసీపీ–2, ఏఎల్‌పీ గని సమీపంలోని బొక్కల వాగును రామగుండం రీజియన్ సేఫ్టీ జీఎం సాంబయ్య బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ భారీ వర్షాల నేపథ్యంలో బొక్కల వాగు వరద నీరు గనిలోకి రాకుండా తీసుకున్న చర్యలపై సంతృప్తి వ్యక్తం చేశారు. రానున్న రోజుల్లో బొగ్గు ఉత్పత్తికి ఆటంకం కలుగకుండా జాగ్రతలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఆయన వెంట రక్షణ అధికారి వెంకటరమణ, పీవో రాజేందర్, మేనేజర్ రామారావు, సర్వే అధికారి మహేందర్, తదితరులున్నారు.

## గుర్తు తెలియని మృతదేహం లభ్యం

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మండలం గౌరెడ్డిపేట గ్రామ శివారులోని ఎల్లమ్మ ఆలయం వద్ద గల వ్యవసాయ బావిలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైనట్లు ఎస్సై మహేందర్ తెలిపారు. బ్లూ కలర్ టీషర్ట్, గోధుమరంగు ప్యాంట్ ధరించాడని, వివరాలకు 8712656506, 8712656507లో నంబర్లలో సంప్రదించాలన్నారు.

## ఆలయాల్లో చోరీ

ఇబ్రహీంపట్నం: మండలంలోని వర్షకొండ, ఇబ్రహీంపట్నం హనుమాన్ ఆలయాల్లో మంగళవారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడినట్లు గ్రామస్తులు తెలిపారు. వర్షకొండలోని హనుమాన్ ఆలయంలో ఆలయ తాళం పగులకొట్టి అర్ధతులం వెండి ఆభరణాలు, పగులకొట్టి రూ. 10వేల నగదు ఎత్తుకెళ్లినట్లు తెలిపారు. మండలకేంద్రంలోని పంచముఖ హనుమాన్ ఆలయంలో హుండీ తాళం పగులకొట్టి సుమారు రూ. 10వేల నగదు, ఇత్తడి గంటను ఎత్తుకెళ్లినట్లు చెప్పారు. మంగిలిపెల్లి లక్ష్మణ్, ఆల య అర్చకులు నవీన్‌చార్యులు ఫిర్యాదు మే రకు ఎస్సై ఉమాసాగర్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు.

# సెప్టెంబర్‌లో వేజ్‌బోర్డు ఏరియర్స్ చెల్లింపు



కేంద్రమంత్రి ప్రహ్లాద్ జోషిని కలిసిన బీఎంఎస్ జేబీసీసీఐ సభ్యులు

గోదావరిఖని: బొగ్గు గని కార్మికులకు 11వ వేజ్ బోర్డు బకాయిలను ఆగస్టు జీతంతో కలుపుకొని సెప్టెంబర్‌లో చెల్లిస్తున్నట్లు వేజ్‌బోర్డు సభ్యులు కొత్త కాపు లక్ష్మారెడ్డి తెలిపారు. బీఎంఎస్ బృందం బొగ్గు గనుల శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషిని ఒప్పించి కోల్ ఇండియా చైర్మన్‌తో ఆదేశాలు జారీ చేయించినట్లు వెల్లడించారు. దీని ద్వారా దేశంలోని బొగ్గుగని కార్మికులకు 11వ వేతన ఒప్పందం ఏరియర్స్ చెల్లించేందుకు ఆదేశాలు జారీ చేశారన్నారు. బీఎంఎస్ కృషితో ఆగస్టు నెల జీతాలతో 23నెలలకు సంబంధించిన ఏరియర్స్ సెప్టెంబర్ మొదటి వారంలో చెల్లిస్తారని వివరించారు. ఈమేరకు కోలిండియా చైర్మన్ ఆదేశాలు జారీ చేశారన్నారు. సింగరేణిలో కోలిండియా సర్క్యులర్ ప్రకారం బకాయిలు చెల్లించాలని బీఎంఎస్ అధ్యక్షులు యాదగిరి సత్తయ్య డిమాండ్ చేశారు.

## కాంట్రాక్టు కార్మికుల వేతనాలు పెంచాలని వినతి



మంత్రి మల్లారెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న ఆకుల వెంకన్న

కమాన్‌పూర్(మంథని): సింగరేణి సంస్థలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు వేతనాల పెంపుతో పాటు పర్మినెంట్ కార్మికులకు కల్పించే హక్కులు కల్పించాలని కోరుతూ రాష్ట్ర కార్మికశాఖ మంత్రి మల్లారెడ్డికి ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆకుల వెంకన్న వినతిపత్రం అందజేశారు. సింగరేణి వ్యాప్తంగా 30వేల మంది కాంట్రాక్టు కార్మికులు పని చేస్తున్నారన్నారు. వారిని పర్మినెంట్ చేసి కోల్ ఇండియాలో తరహాలో వేతనాలు చెల్లించాలని, కార్మికుడు మృతిచెందితే రూ.25లక్షల పరిహారం అందించాలన్నారు. అలవెన్స్‌లు అమలు చేయాలని, ఈఎస్ఐ సౌకర్యం కల్పించేందుకు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని వినతిపత్రంలో కోరారు. ఆయన వెంట రాష్ట్ర అధ్యక్షుడు బ్రహ్మానందం, అరుణ ఉన్నారు.

## అనుమానాస్పద స్థితిలో వ్యక్తిమృతి



హరినాయక్ మృతదేహం

మల్లాపూర్ : గోదావరిలో చేపలు పట్టేందుకు వెళ్లిన ఓ వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతిచెందడంతో గ్రామంలో ఉద్రిక్తతో చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని వాల్గొండ గ్రామానికి చెందిన గుగ్లావత్ హరినాయక్ (47) కు భార్య ముగ్గురు కూతుళ్లు, కుమారుడు ఉన్నారు. కుమార్తెలకు వివాహం కాగా కుమారుడు నాగరాజు తల్లిదండ్రులకు చేదోడు వాదోడుగా ఉంటున్నాడు. హరినాయక్ కొంతకాలంగా రాయికల్‌కు చెందిన ఇషాక్ వద్ద కూలీ పనులు చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. గతనెల 30న గొర్రెపల్లి శివారులోని గోదావరి నదిలో చేపలు పట్టేందుకు ఇషాక్ పిలవడంతో హరినాయక్ వెళ్లాడు. బుధవారం వేకువజామున హరినాయక్ అస్వస్థతకు గురికావడంతో అక్కడే కూలీ పనిచేస్తున్న వాల్గొండ గ్రామానికి చెందిన కల్లెడ రాజేందర్ ఇషాక్‌కు సమాచారం ఇచ్చాడు. హుటాహుటినా ఇషాక్ అక్కడికి చేరుకొని హరినాయక్‌ను రాజేందర్ సహకారంతో ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతిచెందాడు. విషయాన్ని కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చిన ఇషాక్ మృతదేహాన్ని వాల్గొండకు తరలించారు. కుటుంబ సభ్యులు రోడ్డుపైనే మృతదేహం ఉంచడంతో ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. ఎస్సై నవీన్‌కుమార్ సిబ్బందితో వాల్గొండకు చేరుకొని విచారణ చేపట్టారు. మల్లాపూర్ పోలీస్‌స్టేషన్‌లో సీఐ లక్ష్మీనారాయణ, ఎస్సై నవీన్‌కుమార్‌తో కలిసి హరినాయక్ కుటుంబ వారి కుటుంబ సభ్యులతో మాట్లాడారు. హరినాయక్ అనుమానస్పదంగా మృతిచెందాడని, తమకు న్యాయం చేయాలని కోరారు. కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.



విచారణ చేపడుతున్న ఎస్సై నవీన్‌కుమార్

# తల్లిదండ్రులు మందలించారని యువకుడి ఆత్మహత్య

- రైలు కింద పడి బలవన్మరణం



సంతోష్‌కుమార్ మృతదేహం

రామగుండం: తల్లిదండ్రులు మందలించారని మనస్తాపంతో ఓ యువకుడు తెలంగాణ ఎక్స్‌ప్రెస్ రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్న ఘటన రామగుండం–పెద్దంపేట మధ్య.. రామగుండం రైల్వే వంతెన సమీపంలో బుధవారం చోటుచేసుకుంది. జీఆర్పీ ఔట్‌పోస్టు ఇన్‌చార్జి గంగారపు తిరుపతి కథనం ప్రకారం.. గోదావరిఖని ఇందిరానగర్‌కు చెందిన తమ్మిశెట్టి రాము, రంగమ్మ దంపతులకు కుమారుడు సంతోష్‌కుమార్ (18), కూతురు సంతానం. కుమారుడు కాలేజీకి వెళ్లకుండా జులాయిగా తిరుగుతుండడంతో తల్లిదండ్రులు పనికి రావాలని మందలించారు. మనస్తాపం చెందిన సంతోష్‌కుమార్ రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. కేసు దర్యాప్తు చేపడుతున్నట్లు జీఆర్పీ పోలీసులు తెలిపారు.

# తల్లి చితికి నిప్పంటించిన కూతురు

- దహన సంస్కారాలకు దాతల ఆర్థికసాయం

సుల్తానాబాద్: మున్సిపల్ పరిధిలోని రజకనగర్‌కు చెందిన నిరుపేద వృద్ధురాలు ఇప్పకాయల వెంకటమ్మ అనారోగ్యంతో మృతిచెందింది. కూతురే తల్లి చితికి నిప్పంటించడంతో పలువురిని కలచివేసింది. వివరాల్లోకి వెళ్తే.. రజకనగర్‌కు చెందిన వెంకటలక్ష్మీకి కూతురు పద్మ ఉంది. తల్లి బాగోగులు చూసుకునేందుకు ఎవరూ లేకపోవడంతో పద్మ వివాహం కూడా చేసుకోలేదు. వెంకటమ్మ బుధవారం అనారోగ్యంతో మృతిచెందింది. నిరుపేద కుటుంబం కావడంతో దహన సంస్కారాలకు మాజీ జెడ్పీటీసీ ఐల రమేశ్, పలువురు దాతలు ఆర్థిక సాయం అందజేశారు. ఐల రమేశ్ రూ.3 వేలు, మున్సిపల్ చైర్‌పర్సన్ ముత్యం సునీత, రూ.3 వేలు, పద్మశాలీ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు మేర్గు యాదగిరి రూ.3 వేలు అందజేశారు. పద్మశాలీ కుల సంఘం పెద్దలు అయిల సాంబమూర్తి, ఆడెపు అంబదాసు, పెగడ పరుశరాములు, కొండ సత్తయ్య, కాలనీవాసులు అంత్యక్రియల్లో పాల్గొన్నారు. నిరుపేద కుటుంబాన్ని ఆదుకోవాలని పలువురు కోరారు.

# చికిత్స పొందుతూ యువకుడి మృతి

రామగుండం: అంతర్గాం మండలంలోని పెద్దంపేట పంచాయతీ పరిధిలోని సుభాష్‌నగర్‌కు చెందిన తూళ్ల రాజేశ్ కుమారుడు శక్షిత్ గతనెల 26న రోడ్డు ప్రమాదంలో గాయపడగా చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందాడు. మృతుడి బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. సుభాష్‌నగర్‌లో నివాసముండే తూళ్ల రాజేష్–లక్ష్మీకి కుమారుడు శక్షిత్ (23), కుమార్తె అక్షిత ఉన్నారు. ఏడాది క్రితం కుటుంబ సభ్యులు ఉపాధి నిమిత్తం హైదరాబాద్‌కు వెళ్లారు. శక్షిత్ అక్కడ ఓ ప్రైవేట్ కంపెనీలో జాబ్ చేస్తున్నాడు. గతనెల 26న శామీర్‌పేటకు వెళ్తున్న క్రమంలో బైక్ అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో శక్షిత్‌కు తీవ్రగాయాలు కాగా పోలీసులు గాంధీ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతిచెందినట్లు బంధువులు తెలిపారు. మృతదేహాన్ని స్వగ్రామానికి తరలించి అంత్యక్రియలు నిర్వహించారు.

**మరో ఘటనలో..**

ఫెర్టిలైజర్‌సిటీ: గతనెల 31న ఎల్కలపల్లి గేట్ గ్రామానికి చెందిన కొయ్యడ వెంకటేశ్ (36) రోడ్డు ప్రమాదంలో గాయపడగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. గ్రామానికి చెందిన వెంకటేశ్ కూలీకి వెళ్లి తిరిగొస్తున్న క్రమంలో ఎన్టీపీసీ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఆర్ఎఫ్‌సీఎఫ్ టౌన్‌షిప్ రోడ్డుపై డివైడర్‌ను ఢీకొట్టగా బైక్ అదుపుతప్పి పడిపోయాడు. తీవ్రగాయాలు కాగా కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి వెంకటేశ్ మృతిచెందాడు. మృతుడి భార్య కొయ్యడ కవిత ఫిర్యాదు మేరకు ఎన్టీపీసీ ఎస్సై జీవన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# కాంట్రాక్ట్ కార్మికులకు లాభాల వాటా చెల్లించాలి




ర్యాలీ తీస్తున్న కాంట్రాక్ట్ కార్మికులు, నాయకులు

యైటింక్లయిన్‌కాలనీ: సింగరేణి వ్యాప్తంగా పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులకు సింగరేణి లాభాల్లో వాటాను చెల్లించాలని ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు నరేశ్ డిమాండ్ చేశారు. బుధవారం ఆర్జీ–2 ఏరియా జీఎం కార్యాలయం ఎదుట కాంట్రాక్ట్ కార్మికులు నిర్వహించిన ధర్నాలో పాల్గొని మాట్లాడారు. సింగరేణిలో లాభాలు రావడానికి కాంట్రాక్ట్ కార్మికులు కూడా కారణమేనన్నారు. రూ.700 కోట్ల లాభాల్లో కొంతవాటాను వారికి చెల్లించాలని, ఇప్పటికైనా ప్రభుత్వం కాంట్రాక్ట్ కార్మికులకు న్యాయం చేయాలన్నారు. అనంతరం ఆర్జీ–2 డివైజీఎం పర్సనల్ మేనేజర్ రాజేంద్రప్రసాద్‌కు మెమోరాండం అందజేశారు. ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అశోక్, నాయకులు బుచ్చమ్మ, కాంతయ్య, నిర్మల, గట్టయ్య, రమేశ్, పద్మ, మేరీ, రాజేశ్వరి, మధునమ్మ, శాంతమ్మ, లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

# దరఖాస్తుల ఆహ్వానం



మాట్లాడుతున్న మాస్టర్ నారాయణ

పెద్దపల్లిరూరల్: సేవాభారతి, తెలుగుతేజం జాతీయస్థాయి పురస్కారాల కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఆల్ దిబెస్ట్ ఆర్ట్స్ అకాడమీ వ్యవస్థాపక అధ్యక్షుడు మాస్టర్ నారాయణ తెలిపారు. బుధవారం పెద్దపల్లిలో విలేకరులతో మాట్లాడారు. ఆంధ్రా, తెలంగాణలోని పట్టణాలు, పల్లెల్లో ఉన్న సమాజ సేవకులు, ఉపాధ్యాయులు, వైద్యులు, కళాకారులు, కవులు, రచయితలు, క్రీడాకారులు, విద్యావంతులు, కార్మికులు, కర్షకుల ప్రతిభ ఆధారంగా పురస్కారాలను అందిస్తామన్నారు. వారి ప్రతిభకు సంబంధించిన సర్టిఫికెట్లు, ఫొటోలు, పత్రికల క్లిప్పింగ్స్ జిరాక్స్ ప్రతులతో ఈనెల 8లోగా పంపించాలని, మరిన్ని వివరాలకు 9652347207 నంబర్‌లో సంప్రదించాలన్నారు.